నేడు ఉమ్మడి జిల్లా క్రికెట్ ఎంపికలు

సింగూరుకు మళ్లీ భారీ వరద

● ఇన్‌ఫ్లో 25,931 క్యూసెక్కులు..

అవుట్‌ఫ్లో 29,171 క్యూసెక్కులు

5

సిద్దిపేట సీపీగా విజయ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న నూతన సీపీ విజయ్‌కుమార్

సిద్దిపేట క్రైం/మిరుదొడ్డి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట నూతన పోలీస్ కమిషనర్‌గా విజయ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ వెస్ట్‌జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా పనిచేసిన ఆయన బదిలీపై సిద్దిపేట సీపీగా నియమితులయ్యారు. సోమవారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌కు చేరుకున్న విజయ్‌కుమార్ పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. అందరూ టీమ్‌వర్క్ చేయాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన సీపీ

నూతన సీపీగా బాధ్యతలు స్వీకరించిన విజయ్‌కుమార్, సోమవారం మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ హైమావతిని కలిసి పూల మొక్కను అందజేశారు. రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య సైతం నూతన కమిషనర్ విజయ్ కుమార్‌ను కమిషనరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఓటు చోరీపై రాహుల్‌గాంధీ పోరాటానికి మద్దతుగా సంతకాల సేకరణ

నాయకులు, కార్యకర్తలకు సూచించిన జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓట్ల చోరీకి పాల్పడి గద్దెనెక్కిన తీరును నిరసిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన పోరాటానికి మద్దతుగా సంగారెడ్డి నియోజకవర్గంలో భారీ ఎత్తున సంతకాలు చేయాలని ముఖ్య నాయకులు, కార్యకర్తలకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సూచించారు. నియోజకవర్గంలోని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఆత్మకమిటీ చైర్మన్లు, ముఖ్య నాయకులతో సోమవారం ఆయన సమావేశమై దిశా నిర్దేశం చేశారు. రాహుల్‌గాంధీ పోరాటానికి మద్దతుగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు సంతకాల సేకరణను చేపట్టాలన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో ప్రతీ గ్రామంలో, రెండు మున్సిపాలిటీలలోని ప్రతీ వార్డులో 100 మంది చొప్పున సంతకాలు సేకరణ చేయాలని పిలుపునిచ్చారు. తద్వారా ప్రజలకు బీజేపీ పార్టీ దొంగ దారిన అధికారంలోకి వచ్చిన విషయాన్ని ప్రచారం చేయాలన్నారు. ఈ సంతకాల సేకరణను ఈ నెల 12లోగా పూర్తి చేయాలని జగ్గారెడ్డి సూచించారు.





కాంగ్రెస్ ముఖ్య నాయకులతో మాట్లాడుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

స్థానికంపై ఫోకస్



- గజ్వేల్ నియోజకవర్గంలో గులాబీ గూటిలో కోలాహలం
- బీఆర్ఎస్‌లో జడ్పీటీసీ, ఎంపీటీసీ టికెట్ల కోసం నేతల పోటాపోటీ
- కాంగ్రెస్‌లో రిజర్వేషన్లతో అభ్యర్థుల ఉత్సాహంపై నీలినీడలు,
- బీజేపీలో నిరాశ.. అభ్యర్థుల కొరత,
- అధిష్ఠానం దృష్టిసారించడం లేదంటూ కార్యకర్తల ఆవేదన
- బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల వారసుల ఎంట్రీకి రంగం సిద్ధం!!

మాజీ ముఖ్యమంత్రి, శాసనసభ ప్రతిపక్ష నేత కేసీఆర్ సొంత నియోజకవర్గం గజ్వేల్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సమరం వేడెక్కింది. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తికావడంతో ప్రధాన పార్టీలు అభ్యర్థుల వేటలో మునిగిపోయాయి. ప్రతిపక్ష బీఆర్ఎస్‌లో టికెట్ల కోసం తీవ్రమైన పోటీ నెలకొనగా, అధికార కాంగ్రెస్ పార్టీకి రిజర్వేషన్లు తలనొప్పిగా మారాయి. మరోవైపు బీజేపీలో నిరాశ కమ్ముకుంది. పలుచోట్ల అభ్యర్థులు కరువయ్యారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పలువురు నేతల వారసులు ఎన్నికల బరిలోకి దిగేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

గజ్వేల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికలపై ఆయా పార్టీలు దృష్టి సారించాయి. ఇప్పటికే స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తికావడంతో, అభ్యర్థుల కోసం పార్టీలు వెతుకులాట ప్రారంభించాయి. నియోజకవర్గంలో బలంగా ఉన్న ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలో టికెట్ల కోసం అభ్యర్థులు పోటీ పడుతుంటే.. అధికార కాంగ్రెస్ పార్టీలో మాత్రం రిజర్వేషన్లు అంచనాలను తలకిందులు చేశాయి. ఇక భారతీయ జనతా పార్టీలో నైరాశ్యం నెలకొంది. ఒకటి రెండు మండలాలు మినహా, నిలబడడానికి అభ్యర్థులు లేని పరిస్థితి ఆ పార్టీలో కనిపిస్తోంది. ఈ విషయంపై అధిష్ఠానం సైతం పెద్దగా దృష్టి సారించకపోవడంతో, పార్టీని నమ్ముకున్న కార్యకర్తలు ఆందోళనలో మునిగిపోయారు. ఇదే అదునుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ వారసులను బరిలో దింపేందుకు ఆయా పార్టీల నేతలు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

బీఆర్ఎస్‌లో హోరాహోరీ

ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలో ఎంపీటీసీ, జడ్పీటీసీ టికెట్ల కోసం అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. మాజీ ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో ఇక్కడ బీఆర్ఎస్ క్యాడర్ పటిష్ఠంగా ఉంది. దాదాపు అన్ని గ్రామాల్లో పార్టీకి బలమైన కార్యకర్తలు, కార్యవర్గం ఉండడంతో.. తమకంటే తమకు అంటూ టికెట్ల కోసం నాయకులు పోటీ పడుతున్నారు. ఇప్పటికే పలు మండలాల్లో కొందరు కేసీఆర్ తమకు టికెట్ కేటాయించారని ప్రచారాన్ని కూడా మొదలుపెట్టారు. పలువురు నాయకులు మాజీ మంత్రి హరీశ్‌రావును, ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డిని, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డిని కలుస్తూ తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. అంతేకాకుండా, గ్రౌండ్ లెవల్‌లో తమకు అడ్డు రాకుండా ఉండడానికి పలువురితో బేరసారాలు కూడా నడిపిస్తున్నట్లు సమాచారం.

కాంగ్రెస్‌కు రిజర్వేషన్ల దెబ్బ.. ఏకమవుతున్న నేతలు

గజ్వేల్ నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీకి రిజర్వేషన్లు పెద్ద తల నొప్పిని తెచ్చిపెట్టాయని చెప్పొచ్చు . తమకు తిరుగులేదని, టికెట్ ఖచ్చితంగా వస్తుందని భావించిన పలువురు నాయకులను రిజర్వేషన్లు దెబ్బతీశాయి. దీంతో ఏం చేయాలో పాలుపోక అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. ఈ క్రమంలోనే, మూడు వర్గాలుగా ఉన్న కాంగ్రెస్ నాయకులు సైతం ఒక తాటిపైకి వచ్చి పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికి అంతా ప్రశాంతంగా ఉన్నప్పటికీ, టికెట్ల కేటాయింపు సమయానికి పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆసక్తి అందరిలో నెలకొన్నది. ఇన్నాళ్లు ఉప్పు నిప్పుగా ఉన్న వాళ్లే ఒకరికొకరు ఫోన్లు చేసుకుని, "మీరు నిలబడండి.. మీ ఇంటికి బీ-ఫారం తీసుకువచ్చి ఇస్తాం" అంటూ మరో వర్గం వారికి ఫోన్లు చేసి చెబుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

బీజేపీలో నైరాశ్యం..

బీజేపీలో నైరాశ్యం కమ్ముకుంది. పార్టీ నుంచి బరిలో నిలిచేందుకు అభ్యర్థులు లేకపోవడంతో కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. జడ్పీటీసీ స్థానానికి పలుచోట్ల అభ్యర్థులు పోటీపడుతున్నా, కొన్ని చోట్ల అనాసక్తిని చూపిస్తున్నట్లు తెలుస్తోంది. ఎంపీటీసీ స్థానాలకు పెద్దగా పోటీ లేనట్లుగానే కనిపిస్తోంది అధిష్ఠానం పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారించకపోవడంతోనే ఈ పరిస్థితి దాపురించిందని బీజేపీ కార్యకర్తలు వాపోతున్నారు.

వారసుల ఎంట్రీకి రంగం

స్థానిక ఎన్నికల్లో తమ వారసుల ఎంట్రీకి ఆయా పార్టీల నాయకులు రంగం

మిగతా 6వ పేజీలో



చెరువులోకి దూసుకెళ్లిన ద్విచక్రవాహనం

● తొమ్మిది నెలల చిన్నారి మృతి

దుబ్బాక, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక - ధర్మాజీపేట రహదారి మధ్య గల చెరువు కల్వర్టు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. బైక్‌పై ప్రయాణిస్తున్న నలుగురిలో తొమ్మిది నెలల చిన్నారి మృతి చెందింది. సోమవారం రాత్రి జరిగిన ఈ విషాద ఘటన స్థానికంగా విషాదం నింపింది.

దుబ్బాక మున్సిపల్ ధర్మాజీపేట వార్డుకు చెందిన లోకని వెంకటేష్, తన భార్య హేమలత జ్వరంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో భార్యను, ఇద్దరు పిల్లలైన ఆరేళ్ల హరినందిని, 9నెలల నవనందినిని ద్విచక్ర వాహనంపై కూర్చోబెట్టుకొని దుబ్బాక ఆసుపత్రికి బయలుదేరారు. దుబ్బాక, ధర్మాజీపేట రహదారిపై చెరువు కల్వర్టు వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి నేరుగా చెరువులోకి దూసుకెళ్లింది. బైక్‌తో పాటు నలుగురూ చెరువులో పడిపోయారు. వెంకటేష్ తన భార్య హేమలతను, పెద్ద కూతురు హరినందినిని బయటికి లాగాడు. అయితే, చిన్న కూతురు నవనందిని అప్పటికే నీటిలో మునిగి మృతి చెందింది. సమాచారం అందుకున్న దుబ్బాక ఎస్‌ఐ కీర్తిరాజు హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చిన్నారి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



ఆందోళనకు చేస్తున్న వాహనదారుడు

దుబ్బాక పెట్రోల్ బంక్‌లో నీటి కలకలం!

దుబ్బాక, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): దుబ్బాకలోని టీజీఎస్ ఆర్టీసీ లోకల్ పెట్రోల్ బంకులో నీరు కలిసిందంటూ ఓ వాహనదారుడు సోమవారం ఆందోళనకు దిగాడు. దుబ్బాక మున్సిపాలిటీ, ధర్మాజీపేటకు చెందిన బాబు టీజీఎస్ ఆర్టీసీ

మిగతా 6వ పేజీలో

సీపీ అనురాధకు ఘనంగా వీడ్కోలు, సన్మానం

● సిద్దిపేటలో పనిచేయడం గొప్ప అనుభూతి: బి. అనురాధ

సిద్దిపేటక్రైం/దౌల్తాబాద్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళ్తున్న సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధకు జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సిబ్బంది సీపీని గజమాల, శాలువా, మెమొంటోలతో సన్మానించారు. 21 నెలల పాటు సీపీతో పనిచేసిన అనుభూతిని వ్యక్తం చేస్తూ, ఆమెపై అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సీపీ డాక్టర్ బి. అనురాధ మాట్లాడుతూ... సిద్దిపేటలో పనిచేయడం ఒక గొప్ప అనుభూతి అని, ఎప్పుడూ మరువనని తెలిపారు.



సీపీ అనురాధను సన్మానిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది



సీపీ అనురాధతో మనోహర్

మానవత్వం చాటుకున్న అనురాధ

దౌల్తాబాద్ మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన జోడు మనోహర్ అనే బాలుడు రెండేళ్ల క్రితం విద్యుదాఘాతంలో తన కుడిచేతిని కోల్పోయాడు. ఎఫ్ఐఆర్ కోసం పోలీస్ కమిషనర్ కార్యాలయానికి వచ్చిన ఒంటి చేత్తో ఉన్న ఆ బాలుడి పరిస్థితిని గమనించిన సీపీ అనురాధ, వెంటనే స్పందించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి, బాలుడు మనోహర్‌కు కృత్రిమ చేయి అమర్చడానికి ఆర్థిక సాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సహకారానికి మనోహర్ కుటుంబ సభ్యులు సీపీ అనురాధకు, రూరల్ సీఐ శ్రీనుకు కృతజ్ఞతలు తెలిపారు.

కామన్‌డైట్ మెనూ పాటించాలి

● కలెక్టర్ హైమావతి

గజ్వేల్/కుకునూరుపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ హైస్కూల్‌తో పాటు కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో భోజన ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, వంట సిబ్బందితో మాట్లాడారు. కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి, అక్కడ మునగ మొక్కలను పెంచి, కిచెన్ గార్డెన్‌ను విస్తరించాలని హెచ్‌ఎంను ఆదేశించారు. కామన్‌డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని, ఆకుకూరలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థులకు మంచి భోజనం అందించాలని సూచించారు. ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్ నిర్వహించాలన్నారు. కుకునూరుపల్లి పీహెచ్‌సీని కలెక్టర్ తనిఖీ చేశారు. ఫార్మసీ, ల్యాబ్ రూములను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. తనిఖీల్లో ఎంఈవో యెలగందుల కృష్ణ, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్ జడ్పీ హైస్కూల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

రామరాజ్య స్థాపన జరగాలి

● మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దుర్మార్గపు, దుష్టపాలన అంతమై రామరాజ్య స్థాపన జరగాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సిద్దిపేటలోని అంబేద్కర్‌నగర్ 19వ వార్డు, 37వ వార్డులలో నిర్వహించిన శ్రీ దుర్గామాత నిమజ్జన శోభాయాత్రలో పాల్గొని మాట్లాడారు. గతంలో కేసీఆర్ పాలనలో సిద్దిపేటలో ఎప్పుడు ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమం జరుగుతూ ఉండేదని గుర్తుచేశారు. పోయిన రెండేళ్ల నుండి కనీసం రోడ్డు మీద గుంత పడితే పూడ్చే పరిస్థితి కూడా లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చినా, ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పనిసరిగా వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు సిద్దిపేట మరింత అభివృద్ధి చెందుతుందని, పరిశ్రమలు సాధించుకుందామని అన్నారు. అమ్మవారి దీవెనలు మనందరిపై ఉండాలని ప్రార్థిస్తున్నానని తెలిపారు.



అమ్మవారి నిమజ్జన శోభాయాత్రలో హరీశ్‌రావు

ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకం

● అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిద్దిపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమైనదని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, జోనల్ అధికారులకు చివరి విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నామినేషన్ల స్వీకరణ నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకు అధికారులు నిర్వహించాల్సిన బాధ్యతలు ముఖ్యమైనవన్నారు. రిటర్నింగ్ అధికారులు తమ కరదీపికను క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకుని, ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని చెప్పారు. నామినేషన్ల సందర్భంగా పోలింగ్ కేంద్రంలోకి అభ్యర్థితో కలిపి ముగ్గురు మాత్రమే రావడానికి, ఒక వాహనం మాత్రమే అనుమతి ఉందని స్పష్టం చేశారు. ఎంపీడీఓలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఎన్నికల నిబంధనలను తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రమేష్, డీపీవో దేవకీదేవి, డీఆర్‌వో నాగరాజమ్మ, డీఆర్‌డీవో జయదేవ్ ఆర్య తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడికక్కడ కట్టుదిట్టం

● ఎన్నికల దృష్ట్యా నిరంతర నిఘా, చెక్‌పోస్టులు ఏర్పాటు

ఐదు చెక్‌పోస్టులు

- రాజీవ్ రహదారి బెజ్జంకి క్రాస్‌రోడ్
- భూంపల్లి ఎక్స్‌రోడ్
- చేర్యాల ముస్త్యాల వద్ద
- హుస్నాబాద్ జిల్లెలగడ్డ వద్ద
- రాజీవ్ రహదారి వంటిమామిడి వద్ద

సిద్దిపేట క్రైం, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో శాంతిభద్రతల పర్యవేక్షణకు పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎన్నికలను ప్రభావితం చేసేందుకు అవకాశం ఉన్న మద్యం, నగదు అక్రమ రవాణాను నియంత్రించేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. పోలీసు శాఖ జిల్లా నలువైపులా నిరంతర నిఘా ఉంచేందుకు ఐదు కీలక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది. వీటితో పాటు 26 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 5 స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలను నియమించారు. ఈ బృందాల్లో పోలీస్ శాఖతో పాటు రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల డివిజన్ స్థాయి అధికారులు బాధ్యతలు అప్పగించారు.

ఆయా చెక్‌పోస్టుల వద్ద మద్యం, నగదు అక్రమ రవాణా జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ అధికారులతో పాటు వీడియో గ్రాఫర్ నిత్యం అందుబాటులో ఉండనున్నారు. తనిఖీ బృందాలు 24 గంటలు విధుల్లో ఉండేందుకు రెండు షిఫ్టుల్లో పనిచేయనున్నాయి: ఒక అధికారి ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు, మరొక అధికారి సాయంత్రం 6 గంటల నుండి మరునటి రోజు ఉదయం 6 గంటల వరకు పర్యవేక్షిస్తారు.



ఫైల్

రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే సీజ్

ఎన్నికల నిబంధనల మేరకు, ప్రజలు రూ.50 వేలకు మించి నగదును సరైన పత్రాలు లేకుండా తరలించవద్దని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఒకవేళ రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే, దానికి సంబంధించిన సరైన ఆధారాలు లేదా పత్రాలను అధికారులకు చూపించాలి. పత్రాలు లేని పక్షంలో ఆ నగదును సీజ్ చేస్తారు. మద్యం అక్రమంగా తరలించిన పక్షంలో, మద్యం సీసాలను సీజ్ చేయడంతో పాటు, సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

టేక్మాల్/అల్లాదుర్గం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం వ్యానును పట్టుకున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. సోమవారం అల్లాదుర్గం బస్‌స్టాప్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న నేపధ్యంలో ఓ బోలేరో వాహనాన్ని తనిఖీ చేయగా అందులో పీడీఎస్ బియ్యం బస్తాలు ఉన్నాయి. వాటిని గుర్తించి పౌరసరఫరాల అధికారులకు సమాచారం అందించి ఈ బియ్యం బస్తాలను వారికి అప్పగించారు. వారిరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శంకర్ తెలిపారు.



అల్లాదుర్గంలో పట్టుబడిన పీఎస్ బియ్యం వాహనం, నిందితులతో పోలీసులు

టేక్మాల్‌లో

రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని ఆదివారం రాత్రి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివారల ప్రకారం.. పటాన్ చెరువు నుంచి నారాయణఖేడ్ వెళ్తున్న ట్రాలీ ఆటోలో 40 బస్తాల బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం అందింది. బొడ్మాట్ పల్లి గ్రామ శివారులోని 161 జాతీయ రహదారిపై ఆ వాహనంపై దాడి చేసి సీజ్ చేసి పోలీస్ స్టేషనుకు తరలించారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

తాళాలు పగులగొట్టి చోరీ

చేర్యాల/పటాన్‌చెరు అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దసరాకు ఊరెళ్లొచ్చేలోపు చోరీ జరిగిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఆసీఫ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు శాంతినగర్‌లో నివాసం ఉంటున్న అంజనేయులు ఆదివారం రాత్రి సమయంలో కొండకల్‌కు వెళ్లి సోమవారం ఉదయం భార్య నాగరాణితో ఇంటికి తిరిగి వచ్చారు. అప్పటికే ఇంటి తాళం పగలకొట్టి రెండు తులాల బంగారం, 20తులాల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. అంజనేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చేర్యాలలో

చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో ఆగంతకులు చోరికి పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది.. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన తరిగొప్పుల నర్సింహులు ఈనెల4వ తేదీన కుటుంబసభ్యులతో హైదరాబాద్‌కు వెళ్లారు. ఆదివారం రాత్రి ఇంటికి తిరిగి వచ్చిన క్రమంలో తాళాలు పగులగొట్టిఉండటాన్ని గమనించి ఆందోళన చెందారు.

గదిలోపలి బీరువాను ధ్వంసంచేసిన ఆగంతకులు మూడున్నర తులాల బంగారం, 25తులాల వెండి పట్టాగొలుసులు అపహరించుకుపోయారు. ఇంట్లోని వస్తు, సామగ్రిని చిందరవందర చేశారు. ఈవిషయమై సోమవారం చేర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, క్లూస్ టీంను రప్పించి వేలి ముద్రల నమూనాసేకరణకు ప్రయత్నించారు. ఈ విషయమై పోలీసులు త్వరితగతిన ఆగంతకులను పట్టుకుని న్యాయం చేయాలని బాధితుడు వేడుకున్నాడు.

యువకుడి మృతికి దారితీసిన వ్యాపార విభేదాలు

పావన్నపేట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా, పాపన్నపేట మండలం ఏడుపాయలలో చికెన్ సెంటర్‌ల నిర్వహణ విషయంలో జరిగిన ఘర్షణ నాగసానిపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడి మృతికి దారితీసింది. దాడికి గురై పోలీసులకు ఫిర్యాదు చేసి తిరిగి వస్తున్న క్రమంలోనే యువకుడు మరణించడంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగసానిపల్లి గ్రామానికి చెందిన షేరి మహబూబ్ (35) టైర్ పంక్చర్ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఏడుపాయల వద్ద మహబూబ్ సోదరి సుల్తానా చికెన్ షాప్ నిర్వహిస్తుండగా, ఆమె దుకాణం పక్కనే అదే గ్రామానికి చెందిన చాకలి విఠల్ కూడా మరో చికెన్ సెంటర్‌ను నడుపుతున్నాడు. అయితే, దుకాణాల గిరాకీ విషయంలో కొంతకాలంగా సుల్తానా కుటుంబానికి, విఠల్ కుటుంబానికి మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి.



షేరిమహబూబ్ (ఫైల్)

ఈ క్రమంలో ఆదివారం రాత్రి సుల్తానా, మహబూబ్ భార్య రేష్మా దుకాణంలో ఉన్న సమయంలో, పక్క షాపు యజమాని చాకలి విఠల్, అతడి భార్య రాజమణి, కొడుకులు యాదగిరి, మహేష అక్కడికి వచ్చి మహిళలతో గొడవకు దిగారు. విషయం తెలుసుకున్న మహబూబ్ హుటాహుటిన అక్కడికి చేరుకున్నాడు. విఠల్ కుటుంబీకులు మహబూబ్‌పై దాడికి పాల్పడ్డారు. వారు మహబూబ్‌ను కిందపడేసి, ఛాతీపై గుద్దుతూ తన్నినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.తీవ్రంగా గాయపడిన మహబూబ్‌ను కుటుంబ సభ్యులు గ్రామ పెద్దలతో కలిసి అదే రాత్రి పోలీస్ స్టేషన్‌లో దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. ఫిర్యాదు అనంతరం చికిత్స కోసం మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి ఆటోలో తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే మహబూబ్ కుప్పకూలిపోయాడు. ఆసుపత్రికి చేర్చగా, అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

మహబూబ్ మరణ వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు కోపోద్రిక్తులై మృతదేహాన్ని తీసుకుని గ్రామానికి వెళ్లారు. దాడికి పాల్పడ్డ విఠల్ ఇంటి వద్ద మృతదేహాన్ని ఉంచేందుకు యత్నించడంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న సీఐ జార్జ్, ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తమ బలగాలతో వెంటనే గ్రామానికి చేరుకుని, వారి ప్రయత్నాన్ని అడ్డుకుని శాంతింపజేశారు. పోలీసుల జోక్యంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ తరలించి, మార్చురీలో ఉంచారు. మృతుడి భార్య రేష్మా ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి, దాడికి పాల్పడ్డ వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం పోలీసుల భారీ బందోబస్తు మధ్య యువకుడి అంత్యక్రియలు ముగిశాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గ్రామంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు.

వ్యాపార విభేధాలతోనే హత్య

● నిందితుల రిమాండ్



పోలీసుల అదుపులో నిందితులు

మెదక్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వ్యాపారుల మధ్య చోటుచేసుకున్న విభేధాలే హత్యకు దారి తీశాయి. మెదక్ రూరల్ సీఐ జార్జ్ తెలిపిన వివరాల ప్రకారం పాపన్నపేట మండలం నాగ్సాన్‌పల్లి గ్రామంలో చిన్న పాటి వ్యాపారాలు నిర్వహించే షేరి మహబూబ్ ను తోటి వ్యాపారులు హత్య గావించారు. ఈ నెల 5న రాత్రి ఎనినిమి గంటల ప్రాంతంలో ఏడుపాయల 1వ బ్రిడ్జీ సమీపంలో కర్ర విఠల్, కర్ర రాజమణి, కర్ర యాదగిరి, కర్ర మహేష్‌లు మహబూబ్ పై దాడి చేసి పిడి గుద్దులతో గాయపర్చారు. అనంతరం మహబూబ్‌ను స్థానికులు, కుటుంబ సభ్యులు మెదక్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స జరిపించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

దివ్యాంగుడిపై కుక్కల దాడి

కుకునూరుపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : సోమవారం ఓ వికలాంగుడి పై కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. లకుడారం గ్రామానికి చెందిన యాదగిరి (65) నడుచుకుంటూ ఇంటి నుంచి బయటకి వచ్చే క్రమంలో ఒకేసారి కుక్కల గుంపు అతడిపై దాడి చేశాయి. ఎంత నిలవరించినా కూడా వికలాంగుడు కావడంతో నిస్సహాయ స్థితిలో ఉండిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి కుక్కల దాడి నుండి అతడిని కాపాడారు. మొహం ,చేతులు, కాళ్లపై కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడగా గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం వెళ్లాడు. గ్రామంలో ఏదో ఒక మూలన పది రోజులకు ఓ కుక్క కాటు, కోతుల దాడితో ప్రజలు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. దాదాపు గ్రామంలో 200 కుక్కలు, 100కు పైగా కోతులు సంచరిస్తున్నాయి. ఈ ఘటనతోనైనా అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు

కారును ఢీకొన్న లారీ..

● పలువురికి గాయాలు

గజ్వేల్, అక్టోబరు 6(ఆంధ్ర జ్యోతి): రాజీవ్ రహదారిపై కారును లారీ ఢీకొన్న ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారును లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ ఢీకొన్న కారు ముందున్న కారును, ముందున్న కారు మరో కారును ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో లారీ మొదటగా ఢీ కొట్టిన కారులో ప్రయాణిస్తున్న కృష్ణవేణి, నందకిషోర్‌లకు గాయాలవగా, మరో ఇద్దరి స్వల్పగాయాలయ్యాయి. ములుగు 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను గజ్వేల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.



లారీ ఢీకొన్న ఘటనలో నుజ్జునుజ్జైన కారు

మోడల్‌స్కూల్ చోరీపై ఏసీపీ విచారణ

మద్దూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో జరిగిన కంప్యూటర్ల దొంగతనం విషయమై సోమవారం హుస్నాబాద్ ఏసీపీ సదానందం పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు సీసీ కెమెరాలు, స్క్రూలు తీసి ఉన్న కిటికిలను పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్ గదిలోని సీసీ ఫుటేజీలను పరిశీలించి గత నెల 21 నుంచి సీసీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. అధ్యాపకులతో పాటు సిబ్బంది ద్వారా జరిగిన సంఘటనపై వివరాలు అడిగారు. రెగ్యులర్, ఔట్ సోర్సింగ్ ద్వారా ఎంత మంది పనిచేస్తున్నది అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట చేర్యాల సీఐ శ్రీను. మద్దూరు ఎస్ఐ షేక్ మహబూబ్ అలీ, పాఠశాల ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డితో పాటు సిబ్బంది ఉన్నారు.

పత్తిచేనులో కంప్యూటర్ కీబోర్డులు, మౌస్‌లు

మోడల్‌స్కూల్‌లో చోరీకి గురైన కంప్యూటర్ కీబోర్డులు, మౌస్‌లు ఓ ఫంక్షన్‌హాల్ ఎదురుగా ఉన్న ఓ రైతు పత్తిచేనులో లభ్యమయ్యాయి. సోమవారం సాయంత్రం వాకింగ్‌కు వెళ్తతున్న ఓ వ్యక్తి రోడ్డుసైడ్ ఉన్న పత్తిచేను వైపు చూసుకుంటూ వెళుతున్న క్రమంలో కంప్యూటర్ కీబోర్డులు కన్పించడంతో అటుగా వెళుతున్న పాఠశాలలో పనిచేస్తున్న మహిళకు సమాచారం తెలుపడంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్థానిక ఎస్సై షేక్ మహబూబ్ అలీ తన సిబ్బందితో కలిసి పత్తి చేనును సందర్శించి కంప్యూటర్ కీబోర్డులు, మౌస్‌లు సేకరించారు. మోడల్‌స్కూల్‌లో చోరీకి పాల్పడిన వ్యక్తులు రేబర్తి వైపు వెళుతూ కీబోర్డులు, మౌస్‌లు రోడ్డు సైడు పత్తిచేన్లో పడేసి వెళ్లినట్లు తెలుస్తుందని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు రేబర్తి గ్రామం వైపు ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తే దొంగల ఆచూకి ఏమైనా తెలిసే అవకాశం ఉన్నట్లు తెలిపారు.



పత్తిచేనులో కీబోర్డులు, మౌస్‌లు సేకరిస్తున్న ఎస్సై

లద్నూరు వీరభద్రస్వామి దేవాలయంలో చోరీ

మండలంలోని లద్నూరు గ్రామ వీరభద్రస్వామి దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. సోమవారం ఉదయం ఆలయపూజారీ వేణు పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు వెళ్లారు. ఆలయ ప్రాంగణంలో మద్యం సీసాలతో పాటు గేటు తాళం, లోపల హుండీ తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించి, విషయాన్ని ఆలయ అధ్యక్షుడితో పాటు గ్రామ గ్రామస్తులకు తెలుపగా పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్‌టీం అధికారులు వేలిముద్రలను సేకరించారు. మూడేళ్లుగా భక్తులు హుండీలో వేసిన నగదు సుమారు 10 వేలు ఉంటుందని పోలీసులకు గ్రామస్తులు తెలిపారు. మద్దూరు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో కంప్యూటర్ల చోరి ఘటన మరవక ముందే ఆదివారం రాత్రి వీరభద్రస్వామి దేవాలయంలో చోరీ జరగడం పోలీసులకు సవాల్‌గా మారింది. మండలంలో వరుస చోరీలతో మండల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. దొంగతనాలపై గట్టి నిఘా పెట్టి మండల ప్రజలు భయాందోళనకు గురికాకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పరిశ్రమకు జరిమానా

చేగుంట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలోని విద్యుత్ లైన్‌కు అడ్డుగా ఉన్నాయని చెట్లను నరికి వేసిన ఎస్‌పీఎం పరిశ్రమ యాజమాన్యానికి రు.60 వేల జరిమానా విధించినట్లు తూప్రాన్ రేంజ్ ఆఫీసర్ అంబర్ సింగ్ తెలిపారు. మండలం పరిధిలోని వడియారం జాతీయ రహదారిపై చిన్న శివనూర్ శివారులోని పరిశ్రమకు వెళ్లే విద్యుత్ లైనుకు అడ్డుగా ఉన్నాయని ఎలాంటి అనుమతులు లేకుండా సుమారు 30 చెట్ల నరికి వేశారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పరిశ్రమ యజమాన్యానికి నోటిస్‌తో పాటు రూ. 60 వేల జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా చెట్లను నరికితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.



చేగుంట మండలం వడియారం, చిన్న శివనూర్‌లో నరికివేసిన చెట్లు

క్రైం కార్నర్

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

● మరొకరికి గాయాలు

రాయికోడ్, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందగా మరో వ్యక్తిగా గాయాలైన సంఘటన ఆదివారం సాయంత్రం రాయికోడ్ మండలంలో చోటుచేసుకుంది. రాయికోడ్ ఎస్సై చైతన్య కిరణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మునిపల్లి మండలం చిన్నచెల్మెడ గ్రామానికి చెందిన మొగ్గుంపల్లి ఉదయ్ కిరణ్ (26), అదే గ్రామానికి చెందిన రాములుతో కలిసి మనూర్ మండలం బోరంచ పోచమ్మ దేవాలయానికి ఆదివారం వెళ్లారు. తిరిగి అదే రోజు రాత్రి స్వగ్రామమైన చిన్నచెల్మెడకు వస్తున్న క్రమంలో రాయికోడ్ మండలం సింగీతం గ్రామ శివారులో గల బ్రిడ్జి సమీపానికి రాగానే బైక్ అదుపు తప్పడంతో రోడ్డు కిందకు వెళ్లింది. దీంతో వారికి గాయాలు కావడంతో 108 వాహనంలో జహీరాబాద్ ఏరియాసుపత్రికి తరలించగా అప్పటికే ఉదయ్ కిరణ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రాములు జహీరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.



ఉదయ్ కిరణ్ (ఫైల్)

విద్యుత్ షాక్ తగిలి యువకుడు..

సిద్దిపేట క్రైం అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు మృతి చెందాడు. సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల గ్రామానికి చెందిన వివేక్ కిరణ్ రెడ్డి (22) సిద్దిపేట పట్టణంలోని శివాజీ నగర్‌లో నివాసం ఉంటున్నారు. వివేక్ కిరణ్ రెడ్డి సోమవారం ఉదయం హైదరాబాద్ రోడ్‌లో ఉన్న జిమ్‌కి వెళ్లి బిల్డింగ్ నుంచి మెట్ల ద్వారా కిందికి దిగుతున్నాడు. అదే బిల్డింగ్‌లో ఉన్న జైలు మండి రెస్టారెంట్ ఫ్లెక్సీ ఫ్రేమ్ కింద పడి ఉంది. దాన్ని తీసి పక్కన పెడుతుండగా బిల్డింగ్ పక్కన ఉన్న ట్రాన్స్ఫార్మర్‌కు ఐరన్ ఫ్రేమ్ తగిలి కరెంట్ షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వన్ టౌన్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహానికి పంచనామా విధించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి తరలించారు. యువకుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బిల్డింగు యజమానిపై, రెస్టారెంట్ యజమాని పై కేసు నమోదు చేసినట్లు సీఐ వాసుదేవరావు తెలిపారు.

భార్య పోలీసులకు ఫిర్యాదు చేసిందని..

● భర్త ఆత్మహత్య

శివ్వంపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కుటుంబ తగాదాలతో భార్య తనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సోమవారం సీతారాం తండాలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని సీతారాం తండాకు చెందిన కాట్రోత్ తరుణ్ కి(35) భార్య శాంతి మధ్య కొన్ని రోజులుగా మనస్పర్ధలు ఏర్పడ్డాయి. దీంతో తరచూ గొడవ జరుగుతుండడంతో శాంతి పిల్లలతో కలిసి తల్లి గారి ఇంటికి వెళ్లిపోయింది. భర్త ఇబ్బందులకు గురి చేస్తున్నాడని శాంతి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మనస్తాపానికి లోనైన తరుణ్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు ఈ విషయమై ఎస్సై మధుకర్ రెడ్డిని సంప్రదించగా ఈ ఘటనకు సంబంధించిన ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

నేరస్థుడి దారుణ హత్య

చిన్నశంకరంపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పాత కక్షలతో పాత నేరస్తుడు దారుణ హత్యకు గురైన సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని శాలిపేట గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్, ఎస్సై నారాయణగౌడ్ గ్రామాన్ని సందర్శించి ఘటన స్థలంలో మృత దేహాన్ని పరిశీలించి, శవపంచనామ నిర్వహించారు. క్లూస్ టీం బృందం మృతుడి ఆనవాలను సేకరించారు. తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఉప్పరి యాదగిరి (45) పాలివారితో గతం నుంచి గొడవలు సాగుతున్నాయని, కక్ష సాధింపును మనుసులో పెట్టుకున్న ఉప్పరి రాములు, ఉప్పరి శ్యామ్‌లు, ఉప్పరి ఎల్లం ముగ్గురు కలిసి యాదగిరి తలపై బండరాయితో కొట్టి దారుణంగా హత్య చేసి పరారయ్యారు. మృతుడు యాదగిరిపై గతంలో నేరం, రౌడీ షీటర్ కేసులు ఉన్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. హత్యకు గల కారణాలను విచారించి త్వరలోనే వివరాలను వెల్లడిస్తామని డీఎస్పీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జహీరాబాద్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో గాయాలై చికిత్సపొందుతూ వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం జహీరాబాద్‌లో చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై వినయ్‌కుమార్‌కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని నాందెడ్ జిల్ల కిడ్‌మోడ్ గ్రామానికి చెందిన మరాటి బాలాజీ(41) ఈనెల 3న పట్టణంలోని అల్గొల్‌చౌరస్తా నుంచి జహీరాబాద్‌వైపు నడుచుకుంటు వస్తుండగా అల్పాకర్మాగారంవద్ద ఎదురుగావస్తున్న టీఎస్15-ఈఏ5135 నెంబరుగల కారు ఢీకొట్టింది. దీంతో అతడికి బలమైన గాయాలు తగిలడంతో పట్టణంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రభుత్వాస్పత్రిలో ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ సోమవారం సాయంత్రం మృతిచెందాడు. బాధితుడి తరపున ఎర్రోళ్ళస్వరాజ్ ఫిర్యాదుచేయగా కారు డ్రైవర్ గౌతంరెడ్డిపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

నీటి కుంటలో పడి వ్యక్తి ..

గుమ్మడిదల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : నీటి కుంటలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కుమ్మడల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై లక్ష్మీ కాంత్ రెడ్డి కథన ప్రకారం.. గుమ్మడిదల గ్రామానికి చెందిన బాగయ్య (40) ఆదివారం తన బంధువుల దినాలు ఉండడంతో తల వెంట్రుకలు తీసుకుని గుమ్మడిదల గ్రామంలోని ఈద్గా సమీపంలో ఉన్న కుంటలో స్నానానికి వెళ్లి అదృశమయ్యాడు. చుట్టుపక్కల బంధువుల ఇంట్లో వెతికినా దొరకపోవడంతో ఆందోళన చెందారు. మృతుడు కొన్ని గంటల ముందు నీటి గుంట దగ్గర నిలబడి ఉన్న విషయాన్ని తన బంధువులు గమనించి ఇక్కడ ఎందుకు నిలబడ్డావు అని అడగడంతో స్నానం చేసి వస్తానని చెప్పిన విషయాన్ని గుర్తించి కుంట వద్ద ఎంత గాలించిన దొరకడం లేదని తెలిపారు. సోమవారం బాగయ్య శవమై తేలాడు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

తూప్రాన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగకు ఇంటికి వచ్చిన ఓ విద్యార్థి కనిపించకుండా పోయాడు. వెతికినప్పటికీ ఆచూకి లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్సై శివానందం కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన బిజిలీపురం కృష్ణ కుమారుడైన మణికంఠ (17) అమ్మమ్మ ఊరైన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం శాకారం వద్ద ఉంటు ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. దసరా పండుగ సెలవులకు ఇంటికి వచ్చాడు. ఆదివారం రాత్రి చిన్నమ్మ రజిత పిలువడంతో భోజనానికి వెళ్లి అక్కడే పడుకున్నాడు. సోమవారం ఉదయం మణికంఠ కనిపంచకుండా పోయాడు. అతడి కోసం వెతికినప్పటికీ ఆచూకి లభించకపోవడంతో సోమవారం రాత్రి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై శివానందం వివరించారు.



మణికంఠ(ఫైల్)

సింగూరుకు మళ్లీ భారీ వరద

● ఇన్‌ఫ్లో 25,931 క్యూసెక్కులు.. అవుట్‌ఫ్లో 29,171 క్యూసెక్కులు

● మూడు క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

పుల్‌కల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టుకు ఎగువన కర్ణాటక, మహారాష్ట్రతో పాటు జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరద ప్రవాహం వచ్చి చేరుతున్నది. నాలుగైదు రోజుల క్రితం వరద ప్రవాహం తగ్గడంతో ఎత్తిన 11 గేట్లలో తొమ్మిదింటిని మూసేసి, రెండు గేట్లను ఎత్తి ఉంచారు. ఈ నెల 4వ తేదీన వరద ప్రవాహం మరింత తగ్గడంతో ఒక క్రస్ట్‌గేట్‌ను మూసేసి, ఒక గేట్‌ను ఎత్తి ఉంచి వచ్చిన వరదను వచ్చినట్లుగా దిగవకు వదిలారు. అయితే, శనివారం నుంచి ఎడతెరిపి లేకుండా ఎగువన భారీ వర్షాలు కురిశాయి. దీంతో ప్రాజెక్టులోకి వరద నీటి రాక మళ్లీ ప్రారంభమైంది. అప్రమత్తమైన నీటి పారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు మరో రెండు క్రస్ట్‌గేట్లను ఎత్తి వరద నీటిని దిగువకు వదులుతున్నారు. మూడు క్రస్ట్‌గేట్ల ద్వారా 26,218 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి గేట్ గుండా 2,413 క్యూసెక్కులు, హెచ్ ఎండబ్ల్యూఎస్‌కు 80, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు, 390 క్యూసెక్కులు ఆవిరి కాగా, మొత్తం అవుట్‌ఫ్లో 29,171 క్యూసెక్కులుగా నమోదైంది. సోమవారం రాత్రి అందిన సమాచారం మేరకు ప్రాజెక్టులో 521.040 మీటర్లకు 18.342 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. ఇదిలావుండగా సంగారెడ్డి సమీపంలోని మంజీర జలాశయం వద్ద గేట్లను ఎత్తి ఎగువ నుంచి వచ్చిన వరద జలాలను వచ్చినట్లుగానే ఘనపురం ఆయకట్టుకు వదులుతున్నారు.

వైభవంగా దుర్గమ్మ పల్లకీసేవ

పాపన్నపేట, ఆక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పౌర్ణమిని పురస్కరించుకొని ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద అమ్మవారి పల్లకీ సేవను సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ప్రధానాలయం వద్ద వరద ప్రవాహం ఉండడంతో అర్చకులు రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించిన అమ్మవారి మరో ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ప్రతిష్ఠించారు. భక్తుల జయ జయ ధ్వానాల మధ్య రాజగోపురం నుంచి సమీపంలోని శివాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు.

విశ్వవ్యాప్తంగా వాసవీ క్లబ్ సేవలు

● అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు పుల్లూరి ప్రకాష్



నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

నారాయణఖేడ్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : వాసవిక్లబ్‌ల ద్వారా విశ్వవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వాసవీ క్లబ్‌ల అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు పుల్లూరి ప్రకాష్, గవర్నర్ ఇరుకుల ప్రదీప్‌కుమార్ తెలిపారు. సోమవారం నారాయణఖేడ్‌లో వాసవవీ క్లబ్ నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించిన సందర్భంగా వారు మాట్లాడుతూ 1961లో స్వాతంత్ర్య సమరయోధులు కల్వకుంట్ల చంద్రసేనగుప్తా ఒక క్లబ్‌తో సేవా కార్యక్రమాలు ప్రారంభించారని, ప్రస్తుతం అంతర్జాతీయస్థాయిలో 16 రాష్ట్రాలు, 8 దేశాల్లో ప్రతి సంవత్సరం రూ.20 కోట్ల సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా ఫెలోషిప్, లీడర్‌షిప్ లక్షణాలను పెంచడం, సభ్యుల సంక్షేమానికి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ నాయకులు బానురి ప్రకాష్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మునిగాల మాణిక్‌ప్రభు, క్యాబినెట్ సెక్రెటరీ వనం నరేందర్, రీజియన్ చైర్మన్ అల్లంకి వినయ్‌భాస్కర్, జోన్ చైర్మన్ బాల్‌రాజ్, పట్టణ అధ్యక్షుడు దారం క్రిష్ణమూర్తి, అవోప జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్, ఖేడ్ అధ్యక్షుడు సత్యనారాయణ, చార్టర్ ప్రెసిడెంట్ కోటగిరి మల్లేశం, మాజీ డిప్యూటీ గవర్నర్లు భూషణం, నగేష్, మాజీ జోన్ చైర్మన్ సాయిసంగమేశ్వర్, ధన్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు. వాసవిక్లబ్ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన కోటగిరి సాయిబాబా, ప్రధాన కార్యదర్శి అర్థం రమేష్, కోశాధికారి దారం మహేష్‌లచే గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు.



పరిశ్రమల నుంచి వ్యర్థ జలాలు చేరి దోమడుగులో ఎర్రబారిన నల్లకుంట చెరువు

కాలుష్య భూతం
చెరువు విషపూరితం

పరిశ్రమల వ్యర్థ జలాలతో దోమడుగు చిన్నాభిన్నం

పంటలు పండక రైతులకు నష్టం

మృత్యువాత పడుతున్న పశువులు

అనారోగ్యం పాలవుతున్న ప్రజలు

గుమ్మడిదల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : కాలుష్య భూతం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు గ్రామాన్ని చుట్టుముట్టి అక్కడి ప్రజల జీవితాలను నాశనం చేస్తోంది. పరిశ్రమల నిర్లక్ష్యం కారణంగా వెలువడుతున్న విషతుల్య వ్యర్థాలతో గాలి, నీరు కలుషితమై ప్రజల జీవన విధానం చిన్నాభిన్నమవుతోంది.

చెరువులో విషజలాల

మండల పరిధిలోని బొంతపల్లి, దోమడుగు పారిశ్రామిక వాడల్లోని వివిధ పరిశ్రమలు వర్షం చాటున విచ్చలవిడిగా వదిలిపెడుతున్న రసాయన వ్యర్థాలు వర్షం పడినప్పుడల్లా ఏరులై ప్రవహిస్తున్నాయి. ఈ విషజలాలన్నీ గ్రామంలోని నల్లకుంట చెరువులో చేరుతుండటంతో, ఒకప్పుడు చేపలతో కళకళలాడిన ఆ చెరువు ఇప్పుడు ఎర్రని కాలుష్య జలాలతో పూర్తిగా నిండి కలుషితమైపోయింది.

రైతులకు తీరని నష్టం

కాలుష్య జలాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నల్లకుంట చెరువు కింద సాగు చేసే సుమారు 100 ఎకరాల పంట పొలాల్లోకి ఈ రసాయన జలాలు చేరడంతో పంటలు పూర్తిగా నాశనమవుతున్నాయి. ఒకప్పుడు బంగారు పంటలు పండించిన భూములు ఇప్పుడు విషాన్ని పండిస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. కాలుష్య జలాలతో పంటల నుంచి కాడు వాసన వస్తోందని, పంటలు మొలకెత్తినా ఎండిపోవడం, పాడైపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని వాపోతున్నారు.



రసాయన జలాలతో మృతిచెందిన చేపలతో నిరసన(ఫైల్)

మృత్యువాత పడుతున్న మూగజీవాలు

వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న పశు పోషకుల పరిస్థితి దీనంగా మారింది. చెరువులో కలుషితమైన నీరు తాగిన పశువులు అనారోగ్యానికి గురై, మూత్రవిసర్జన సమస్యలతో ఇబ్బంది పడుతూ మృత్యువాత పడుతున్నాయి. గేదెల దూడలు సైతం పుట్టిన 20 రోజులకే అనారోగ్యం పాలై చనిపోతున్నాయి. దూడలను తోలు తీసి, వాటితో దూడ బొమ్మలుగా తయారు చేసి పశువుల ముందు పెట్టి పాలు పితకాల్సిన పరిస్థితి వస్తుందని వాపోతున్నారు. చెరువుపై ఆధారపడిన దాదాపు 96 మత్స్యకార కుటుంబాలు చేపలను పెంచి పోషించలేక జీవనాధారం కోల్పోయారు.



కాలుష్యంపై చర్యలు తీసుకోవాలని నిరసన (ఫైల్)

ప్రమాదంలో ప్రజారోగ్యం

కాలుష్యం భూగర్భ జలాల్లోకి కూడా చేరిపోవడంతో, ఆ నీరు తాగి గ్రామ ప్రజలు తరచూ అనారోగ్యం పాలవుతున్నారు. చర్మ వ్యాధులు, కడుపు సమస్యలు, శ్వాస సంబంధిత ఇబ్బందులతో బాధపడుతున్నారు. రోజువారీ కూలీ పనులకు వెళ్లే ప్రజలు అనారోగ్యం కారణంగా పనికి వెళ్లలేక, వైద్య ఖర్చులు భరించలేక ఆర్థిక కష్టాల్లో కూరుకుపోతున్నారు.

పంటలు నాశనమై ఆర్థికంగా నష్టపోతున్నాం



తరచూ రసాయన జలాలు పంట పొలాల్లో కలుషితం అవుతూ నాశనం అవుతున్నాయి. ఆర్థికంగా ఎంతో నష్టపోతున్నాం. ఒకప్పుడు మా పొలాలు బంగారం ఇచ్చేవి. ఇప్పుడు విషం పండిస్తున్నాయి. మా కష్టానికి ప్రతిఫలం దక్కడం లేదు. ఈ కాలుష్యం మాకే కాదు మా భవిష్యత్తు తరాలకు కూడా శాపమవుతుంది.

- మంగయ్యగౌడ్, రైతు, దోమడుగు

పశువులు చనిపోయి ఆదాయం కోల్పోతున్నాం



పొలం లేక బతుకుదెరువు కోసం గేదెలను పోషించి వచ్చిన పాల డబ్బుతో సంసారాన్ని వెల్లదీస్తున్నాం. కాలుష్య జలాలతో చెరువు కలుషితమై పశువులు ఆ నీళ్లు తాగి చనిపోతున్నాయి. విష జలాలతో దూడల సైతం బతికే స్థితిలో లేవు. దీంతో ఆదాయం కోల్పోయి బతకలేకపోతున్నాం. దీంతో ఆదాయం లేక కుటుంబ పోషణ భారమైంది.

- చింతల లక్ష్మి, పశుపోషకురాలు

పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి



దోమడుగులోని నల్లకుంట చెరువును పూర్తిగా రసాయన జలాలతో కొన్ని పరిశ్రమలు నాశనం చేస్తున్నాయి. తక్షణమే అధికారులు స్పందించి ఆ పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి. కాలుష్య జలాలతో నిండిన చెరువులో చేపలను పెంచి పోషించలేక అనేక మత్స్యకార కుటుంబాలు జీవనాధారం కోల్పోతున్నాయి. మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలి.

- వీరేశం, మత్స్యకార సంఘం సభ్యుడు

అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం

గత కొన్నేళ్లుగా ప్రజలు ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నా, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం పలువురి ఆక్రోశానికి కారణమవుతోంది. పరిశ్రమ యాజమాన్యాలు కాలుష్యాన్ని నియంత్రించే చర్యలు చేపట్టకుండా లాభాల కోసమే పనిచేస్తున్నాయి. కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులు కేవలం శాంపిల్ సేకరణకే పరిమితమవుతున్నారని, పరిశ్రమలపై ఇప్పటివరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని గ్రామస్థులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఎన్నిసార్లు ఆందోళనలు నిర్వహించినా కనీస చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. 'ఇలాగైతే మేమెలా బ్రతుకుతాం?' అంటూ దోమడుగు గ్రామ ప్రజలు బోరుమంటున్నారు. కాలుష్య బారి నుంచి తమను కాపాడాలని ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు. తక్షణమే పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్య జలాలను నియంత్రించి, రైతులకు నష్టపరిహారం అందించి, ప్రజలకు శుద్ధమైన తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

సరిపడా లేవు.. సమయానికి రావు

నర్సాపూర్‌లో చెత్త సేకరణకు తప్పని తిప్పలు

పట్టణంలో రోజుకు 4 టన్నుల చెత్త ఉత్పత్తి

పనిచేస్తున్నవి కేవలం ఆరు వాహనాలే

ఉదయం వేళ పట్టణవాసుల నిరీక్షణ

నర్సాపూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరణకు సరిపడా వాహనాలు లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దాదాపు 30 వేల వరకు జనాభా ఉన్న నర్సాపూర్ పట్టణంలో (15 వార్డులు) రోజుకు సుమారు 4 టన్నుల చెత్తను సేకరించాల్సి ఉంది. అయితే, ప్రస్తుతం ఉన్న అరకొర వాహనాలతో మున్సిపల్ సిబ్బంది పడరాని పాట్లు పడుతుండగా, స్థానిక ప్రజలకు సైతం చెత్త వేయడానికి గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది.



నర్సాపూర్‌లోని చెత్తసేకరణ వాహనాలు

అరకొర వాహనాలు.. అదనపు భారం

నర్సాపూర్ మున్సిపాలిటీకి చెత్త సేకరణ కోసం 8 వాహనాలు మాత్రమే ఉన్నాయి. అందులోనూ రోజు రెండు వాహనాలు మరమ్మతుల్లో ఉంటున్నాయి. దీంతో ప్రతిరోజూ పనిచేసే వాహనాలు ఆరుకు మించి ఉండటం లేదు. పనిచేసే ఒక్కో వాహనం రోజుకు మూడు నుంచి నాలుగు వార్డులలో తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. అన్ని వీధుల్లోకి వెళ్లి ఇంటింటి చెత్తను సేకరించడంతో పాటు, వ్యాపార కూడళ్లు, ఇతర ప్రాంతాల్లో అవసరమైతే ఈ వాహనాలనే వినియోగించాల్సి వస్తోంది.

ప్రజలకు తప్పని నిరీక్షణ

సాధారణంగా ఉదయం 5 గంటల నుంచే వాహనాలు పట్టణంలో చెత్త సేకరణకు తిరుగుతున్నప్పటికీ, ఒక్కో వాహనంపై అధిక వార్డుల భారం పడడంతో ఇంటింటికీ చేరడానికి జాప్యం జరుగుతోంది. కొన్ని వీధుల్లో ఉదయం 11 వరకు వాహనం రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరణ్‌రెడ్డిని సంప్రదించగా చెత్త సేకరణకు సరిపడా వాహనాలు లేకపోవడంతో ఇబ్బంది ఎదురవుతున్న విషయం వాస్తవమేనని అంగీకరించారు. తాను ఇటీవలే కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నందున, ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని పేర్కొన్నారు.

నేడు ఉమ్మడి జిల్లా క్రికెట్ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జూనియర్ కాలేజ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉమ్మడి జిల్లా జట్టు క్రికెట్ ఎంపికలు నిర్వహించనున్నట్టు సెక్రటరీ గణపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డిలోని ఎంఎస్ క్రికెట్ అకాడమీలో అండర్-19 బాలికల విభాగంలో ఎంపికలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 9 గంటల రకు హాజరు కావాలని సూచించారు. టెన్త్ మెమో, బోనాఫైడ్, బర్త్ సర్టిఫికేట్, ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. వివరాలకు 9440686408, 8106841226 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.





2వ వార్డులో ఉచితంగా ట్యాంకరు ద్వారా, 10వ వార్డులో బోరునే స్థానిక ప్రజలకు వాడుకునేలా చేసిన ఆశావహులు

నర్సాపూర్‌లో 'నీళ్ల రాజకీయం'

నర్సాపూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్‌లో ప్రస్తుతం మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో, ఇది మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌గా పోటీ చేయాలని ఆశిస్తున్న ప్రధాన పార్టీల నేతలకు రాజకీయ అవకాశంగా మారింది. మంజీర పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా నీటి సరఫరా నిలిచి, స్థానిక బోర్ల ద్వారా చాలిచాలని నీరు వస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని ఉపయోగించుకుంటూ, 2 వార్డు ఆశావహుడు ఒకరు ట్యాంకర్ ద్వారా, 3వ వార్డు ఆశావహుడు బోరు వేయించి, 10వ వార్డులో తన ఇంటి బోరును ఉచితంగా అందిస్తూ సొంత ఖర్చులతో నీటిని సరఫరా చేస్తున్నారు. ఇలా నీటి కష్టాల్లో ప్రజలకు దగ్గరై, మద్దతు కూడగట్టేందుకు ఆశావహులు పోటీ పడుతుండటం నర్సాపూర్ పట్టణంలో ప్రధాన చర్చనీయాంశంగా మారింది.

గాలిలోదీపంలా సబ్సిడీ!

ఐదు నెలలుగా అందని సబ్సిడీ ● ఖాతాల్లో డబ్బు జమకాక వినియోగదారుల్లో అసహనం

గ్యాస్ సబ్సిడీ నిలిపివేతతో పేద, మధ్య తరగతిపై అదనపు భారం



రామాయంపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వంట గ్యాస్ సబ్సిడీ వినియోగదారుల ఖాతాల్లో జమకాక గాల్లో దీపంలా మారింది. ఐదు నెలలుగా సబ్సిడీ డబ్బులు తిరిగి (రీఫండ్) ఖాతాల్లో జమకాకపోవడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీపై ఎంతో ఆశలు పెట్టుకున్న వినియోగదారులకు ప్రస్తుతం నిరాశే ఎదురవుతోంది.

మెదక్ జిల్లాలో వినియోగదారులు

మెదక్ జిల్లా పరిధిలో మొత్తం 2,35,412 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. జిల్లాలోని 17 ఏజెన్సీల పరిధిలో వినియోగదారులు హెచ్‌పీ, బీపీ, ఐవోసీ వంటి కంపెనీల నుంచి గ్యాస్ సిలిండర్లను పొందుతున్నారు.

నిలిచిన రూ.374 సబ్సిడీ

ఒక్కో గ్యాస్ సిలిండర్ ధర రూ.922 ఉండగా, ప్రభుత్వం ఒక్కో సిలిండర్‌పై రూ.374 సబ్సిడీగా వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి నాళ్లలో కొన్నాళ్లు ఈ సబ్సిడీ నెలనెలా ఖాతాల్లో జమ అయినప్పటికీ, గత ఆరు నెలల నుంచి మాత్రం సబ్సిడీ ఊసే లేకుండా పోయింది. దీంతో సామాన్య ప్రజానీకం, పేద కుటుంబాలపై అదనపు భారం పడుతోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోకపోవడం ఏమిటంటూ వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.

ఉజ్వల, దీపం పథకాలు నీరుగారాయి

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు అందించడానికి ప్రభుత్వం ఉజ్వల, దీపం వంటి పథకాలను ప్రవేశపెట్టింది. తెల్లరేషన్ కార్డు కలిగిన వారికి 2018లో మొదలైన ఉజ్వల పథకం కింద మొదట్లో కొంతమందికి కనెక్షన్లు ఇచ్చారు. అయితే, ప్రస్తుతం ఆ పథకం నీరుగారింది. వంట గ్యాస్ ధరలు పెరిగిన ప్రస్తుత తరుణంలో, ఈ ఉచిత కనెక్షన్ల పథకాల కింద ఒక్క కనెక్షన్ కూడా ఇవ్వడం లేదు. ఎన్నికలు ఉన్నప్పుడే ప్రభుత్వం సబ్సిడీ పథకాలను, ఉచిత కనెక్షన్లను అమలు చేస్తోందని, ప్రస్తుతం ఎలాంటి ఎన్నికలు లేని కారణంగా వాటిని పూర్తిగా విస్మరించిందని వినియోగదారులు విమర్శిస్తున్నారు.

సీటీ స్కానర్ లేక ప్రభుత్వ ఆస్పత్రిలో అవస్థలు

జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో రోగులకు ఇబ్బందులు



జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వఆస్పత్రి

జహీరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో సీటీ స్కానర్ యంత్రం అందుబాటులో లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్కానింగ్ అవసరమైన రోగులను వైద్యులు జిల్లా కేంద్రాలకు రెఫర్ చేయడం లేదా ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లలో పరీక్షలు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయమై ఉన్నతాధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోగా, ఇటీవల సంగారెడ్డి మెడికల్ కళాశాల నుంచి ఇక్కడికి వచ్చిన స్కానర్ ఆపరేటర్లకు యంత్రం లేకపోవడంతో ఆస్పత్రి అధికారులు ఇతర పనులు అప్పగిస్తున్నారు. అయితే, జిల్లా కేంద్రాల్లో మాత్రమే సీటీ స్కానర్ ఉంటుందని సూపరింటెండెంట్ చెబుతున్నప్పటికీ, పేద రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాస్పత్రిలో వెంటనే యంత్రాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు, రోగులు డిమాండ్ చేస్తున్నారు.



నల్లవాగు గలగల

నల్లవాగు ప్రాజెక్టు జలకళను సంతరించుకున్నది. ఎగువ ప్రాంతంలో ఎప్పుడూ లేనంత రికార్డుస్థాయిలో వర్షం కురియడంతో ప్రాజెక్టులోకి భారీ వరద ప్రవాహ చేరుతున్నది. రికార్డుస్థాయిలో 30 వేయిల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. అంతేస్థాయిలో అవుట్‌ఫ్లో ప్రాజెక్టు అలుగుపై నుంచి పారుతుంది. దీంతో దిగువన ఉన్న లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి.

- కల్హేర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్

దర్గా పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

కొండపాక, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) మండలంలోని దర్గా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం మధ్యాహ్న భోజనం కోసం ప్లేట్లను పంపిణీ చేశారు. పెరుమాండ్లనగర్‌లో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన లింగారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సత్యనారాయణరెడ్డి విద్యార్థులకు ప్లేట్లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి గ్రామస్థులు పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలి

గజ్వేల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గజ్వేల్ మండల పరిధిలోని బంగ్లావెంకటాపూర్ మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు తిగుళ్ల ప్రభాకర్ ఉద్యోగ విరమణ సభలో ఆయన మాట్లాడుతూ... సమాజంలోని వృత్తులన్నింటిలో ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని, అది ప్రభుత్వాల నైతిక బాధ్యత అని గుర్తు చేశారు. ఆర్థిక పరిస్థితిని సాకుగా చూపి రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను నిలిపి వేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంచంద్రం, రాజులు, యూసుఫ్, జోన్ కన్వీనర్ శ్రీనివాస్, పాపిరెడ్డి, ఎల్లయ్య, నర్సింలుగౌడ్, మల్లయ్య ఉన్నారు.

సీజేఐపై దాడి.. భారతదేశం పైన దాడే



దళిత ప్రజా సంఘాల నాయకుల నిరసన

గజ్వేల్ రూరల్ 6 (ఆంధ్రజ్యోతి): అత్యున్నత న్యాయస్థానంలో ఉన్న సుప్రీంకోర్టు సీజేఐ గవాయి కోర్టు కేసులో వాదనలు వింటుండగా ఒక లాయరు సుప్రీంకోర్టు సీజేఐ పైకి షూ విసరడం యావత్ భారతదేశంపై దాడిగానే పరిగణిస్తున్నట్టు గజేల్ దళిత ప్రజా సంఘాలు పేర్కొన్నాయి. సోమవారం గజ్వేల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత ప్రజాసంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భారతదేశంలో భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటూ రాజ్యాంగ రక్షణగా ఉన్న సుప్రీంకోర్టు అత్యున్నత న్యాయస్థానంలో ఉన్నటువంటి సీజేఐపైన దాడి అనేది సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. దాడి చేసిన వ్యక్తిని వెంటనే బార్ కౌన్సిల్ డిస్మిస్ చేసి వెంటనే అరెస్టు చేయాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ నాయకులు తుమ్మ శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పొన్నాల కుమార్, ప్రజా సంఘాల ఐకాస రాష్ట్ర కార్యదర్శి చిప్పల యాదగిరి, అంబేడ్కర్ సంఘం సీనియర్ నాయకులు మైస స్వామి, నర్సింలు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే భవిష్యత్‌లో ఉన్నత ఉద్యోగాలు సాధ్యం



మెడికల్ విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్న ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి

హుస్నాబాద్‌రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇష్టపడి చదివిన విద్యార్థులే భవిష్యత్‌లో ఉన్నత ఉద్యోగాలు సాధించగలరని సీవీ రామన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ కాయిత నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నీట్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి మెడికల్ సీటు సాధించిన పూర్వవిద్యార్థులు బొమ్మగాని హరిక, కేడిక శ్రీలక్ష్మి, వెల్దండి విష్ణులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ విద్యార్థులు మాట్లాడుతూ ప్రాథమికస్థాయిలో నేర్చుకున్న నైతిక విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసం ద్వారానే ఈ రోజు తమకు మెడికల్ సీట్లు సాధ్యమైనట్లు పేర్కొన్నారు మెడికల్ విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

దుబ్బాక పెట్రోల్ బంక్‌లో నీటి కలకలం!

(3వ పేజీ తరువాయి)

పెట్రోల్ బంకులో రూ.190 విలువైన పెట్రోల్‌ను తన ద్విచక్రవాహనంలో పోయించుకున్నాడు. అక్కడి నుంచి రాజక్కపేట వెళ్లేసరికి వాహనం ఆగిపోయింది. ఎంతకూ స్టార్ట్ కాలేదు. దీంతో వాహనాన్ని ఆటోలో పెట్రోల్ బంకుకు తీసుకువచ్చిన బాబు, ట్యాంకులోని పెట్రోల్‌ను మూడు ప్లాస్టిక్ బాటిళ్లలోకి తీశాడు. ప్లాస్టిక్ బాటిళ్లలో పైన పెట్రోల్, కింద నీరు ఉన్నట్లు బంక్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాడు. పెట్రోల్‌లో నీరు కలిసే అవకాశం లేదని యాజమాన్యం చెప్పడంతో, బాధితుడు తనకు న్యాయం చేసి, బంక్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు. దీనిపై వివరణ అడగ్గా, పెట్రోల్‌లో ఇథనాల్ పరిమాణం ఎక్కువగా ఉంటే నీరుగా మారే అవకాశం ఉంటుందని యాజమాన్యం తెలియజేసినట్లు సమాచారం

రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటు చేయాలి



జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న చేర్యాల శివారు మొండిచింత కాలనీవాసులు

చేర్యాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణ శివారు మొండిచింత, శ్రీరాంనగర్ కాలనీ వద్ద ఆర్టీసీ బస్సులు నిలిపి రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జనగామ-సిద్దిపేట జాతీయ ప్రధాన రహదారిపై నిరసన చేపట్టగా, సీపీఎం చేర్యాల మండల కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్ మాట్లాడారు. కాలనీలో సుమారు 500జనాభా ఉన్నారని, పట్టణ శివారున ఉండటంతో ఆటో సౌకర్యం లేక ప్రతీ అవసరానికి కాలినడకన నడుచుకుంటూ ఇబ్బందులుపడుతున్నారన్నారు. జనగామ, సిద్దిపేటకు నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తున్న క్రమంలో కాలనీవద్ద నిలపడంలేదని, తద్వారా కిలోమీటర్ల దూరం వరకు కాలినడకన వెళ్తూ తంటాలుపడుతున్నారన్నారు. ఈవిషయమై శ్రీరాంనగర్, మొండిచింతల కాలనీ వద్ద రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటుచేయాలని, లేదా ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో తుమ్మలపల్లి అనిల్, బోయిని మల్లేశం, దండబోయిన భాస్కర్, మేర్గోజు రాంప్రసాద్, చింతల భిక్షపతి, దీకొండ లచ్చవ్వ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం



సిద్దిపేటలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో ఓటు చోరీ సంతకాల సేకరణ పత్రాన్ని ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్

సిద్దిపేట అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకునే వీలును రాజ్యాంగం కల్పిస్తే ప్రధాని మోదీ మాత్రం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాడని సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ ఆరోపించారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో పట్టణంలోని 43 వార్డులకు చెందిన వార్డు ఇన్‌చార్జిలు, పలువురు కౌన్సిలర్లతో ఓట్ చోరీపై వంద మంది ప్రజల సంతకాల సేకరణ, ప్రజలకు అవగాహన కార్యక్రమం పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని ఒక్కో వార్డులో కనీసం వంద మందితో సంతకాలు చేయించాలని, బీజేపీ ఓట్ చోరీ ఎలా చేసిందో ప్రజలకు, నాయకులు కార్యకర్తలు వివరించాలన్నారు. ఓట్ చోరీ వల్లే ప్రధాని నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చారని, తెలంగాణలో బీజేపీ 8 ఎంపీ సీట్లను సైతం అలాంటి మోసాలకు పాల్పడే గెలిచిందని అనుమానం ఉందని తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలంతా కలిసికట్టుగా పోరాటం చేయాలని చెప్పారు. ఈ నెల 15న సంతకాల సేకరణ పూర్తి చేసి అధిష్ఠానానికి స్వయంగా అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముద్దం లక్ష్మి, మార్క సతీష్‌గౌడ్, దాస అంజయ్య, వహీద్‌ఖాన్, కలిముద్దీన్, చాంద్‌మియా, మార్క పద్మ, గయాజుద్దీన్, వహాబ్, అర్షద్, బాబా, అజ్మత్, కావేరి, పద్మారెడ్డి, భవాని, రజిని, సన తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు: నర్సారెడ్డి



లింగారెడ్డిపల్లిలో కవితానర్సింలు నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

జగదేవపూర్: సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి పేర్కొన్నారు. మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద లింగారెడ్డిపల్లి గ్రామానికి మొదటి విడతలో 70 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా 23 మంది లబ్ధిదారులు ఇళ్ల పనులను ప్రారంభించారు. కవిత నర్సింలు ఇళ్లు పూర్తి కావడంతో సోమవారం లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇంటిని నర్సారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒకరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తామన్నారు. ఇల్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందవద్దని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు మహేందర్‌రెడ్డి, మహేష్‌యాదవ్, ఆయూబ్, మల్లేశం, మునీర్, చంద్రశేఖర్‌రెడ్డి, కరుణాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



చిరు వ్యాపారులకు రోడ్డు ప్రమాదాల గురించి అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ

కొండపాక,అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డుకు దగ్గరగా బుట్టలు పెట్టుకొని అమ్మకాలు చేయవద్దని గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళి సూచించారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో కొమురవెల్లి కమాన్ వద్ద రాజీవ్ రహదారి పక్కన సీతాఫలాలు అమ్ముకుంటున్న చిరు వ్యాపారులకు సోమవారం అవగాహన కల్పించారు. రోడ్డుకు దగ్గరగా బుట్టలు పెట్టుకొని అమ్మవద్దని రోడ్డుకు కొద్ది దూరంలో పెట్టుకొని సీతాఫలాలు పెట్టుకుని అమ్మాలన్నారు. వచ్చిపోయే వాహనాలను గమనిస్తూ ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ నిరేష్, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి: మాజీ ఎమ్మెల్యే



గజ్వేల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

గజ్వేల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా ఇన్‌చార్జి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ సూచించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల, నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏకతాటిపైకి వచ్చి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రతీ మండలం నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు టికెట్ ఆశిస్తున్న వారి వివరాలను ఆయన సేకరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు భైరి శంకర్ ముదిరాజ్, మెదక్ పార్లమెంట్ కోకన్వీనర్ నలగామ శ్రీనివాస్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, సీనియర్ నాయకులు తదితరులున్నారు.

రక్షణ చట్టాల ఏర్పాటు.. న్యాయవాదుల విజయం



మాట్లాడుతున్న లాయర్స్ ఫోరం అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది నర్రి స్వామి

గజ్వేల్ రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రక్షణ చట్టాలు ఏర్పాటుకు సిద్ధం కావడం న్యాయవాదుల విజయమని లాయర్స్ ఫోరం అధ్యక్షుడు హైకోర్టు న్యాయవాది నర్రి స్వామి పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణ కేంద్రంలోని ప్రధాన కోర్టు ఆవరణలో అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పండరితో కలిసి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని బార్ అసోసియేషన్స్ తిరుగుతూ న్యాయవాదులకు రక్షణ చట్టాల ఏర్పాటు కోసమై ఉద్యమించాలని చైతన్య పరుస్తున్నట్టు తెలిపారు. తమ ఉద్యమాలకు స్పందించిన కేంద్ర ప్రభుత్వం లా మినిస్టర్ రక్షణ చట్టాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించడం చాలా సంతోషకరమన్నారు. రాబోయే బార్ కౌన్సిల్ ఎన్నికల్లో తాను బార్ కౌన్సిల్ మెంబర్‌గా పోటీ చేస్తున్నానని, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్ రాజ్‌పండరి, జనరల్ సెక్రటరీ కరుణాకర్, జాయింట్ సెక్రటరీ బింగి భాస్కర్ సీనియర్ న్యాయవాదులు బాలకృష్ణ మరియు కనకయ్య, నర్సింలు, రామకృష్ణ నరసింహాచారి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికంపై ఫోకస్

(3వ పేజీ తరువాయి)

సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. రిజర్వేషన్లు అనుకూలంగా రావడంతో తమ వారసులను రంగంలోకి దింపాలని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నేతలు యోచిస్తున్నారు. వర్గల్ మండల జడ్పీటీసీ స్థానం జనరల్ మహిళకు కేటాయించడంతో, మాజీ ఎమ్మెల్యే తనయ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డిని బరిలో దింపేందుకు నర్సారెడ్డి యోచిస్తున్నారని సమాచారం.

గజ్వేల్ జడ్పీటీసీ స్థానం నుంచి బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి కోడలు రోజారెడ్డిని నిలపాలని లేదా తూప్రాన్ స్థానం నుంచి ఆయన తనయుడు విజయ్‌వర్ధన్‌రెడ్డిని బరిలో నిలపాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. వీరిలో ఒకరిని జడ్పీ వైస్ చైర్మన్ రేసులో నిలపాలని కూడా యోచిస్తున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

కుకునూరుపల్లి ఎంపీపీ స్థానానికి పోటాపోటీ

నూతనంగా ఏర్పాటైన కుకునూరుపల్లి ఎంపీపీ స్థానానికి నాయకులు పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మండల అధ్యక్ష పదవి ఎస్సీ జనరల్‌కు దక్కడంతో పోటీ రసవత్తరంగా మారింది. ఈ ఎంపీపీ పరిధిలో ఐదు ఎంపీటీసీ స్థానాలకు (రెండు జనరల్, రెండు బీసీ, ఒక ఎస్సీ స్థానం (చిన్నకిష్టాపూర్) పోటీ నెలకొంది. ఈ ఎస్సీ ఎంపీటీసీ స్థానంలో టికెట్ దక్కించుకుంటే ఎంపీపీ పీఠంపై నేరుగా కూర్చునే అవకాశం ఉందని ఆయా పార్టీలకు చెందిన నాయకులు భావిస్తున్నారు. ఈ క్రమంలో అధికార బీఆర్ఎస్ పార్టీలో పోటీ తీవ్రంగా మారింది.

జడ్పీటీసీ స్థానాలకు ఇలా...

గజ్వేల్ జడ్పీటీసీ స్థానం నుంచి బీఆర్ఎస్ నుంచి వంటేరు రోజారాణి, మాదాసు అన్నపూర్ణ, మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, పండరి రవీందర్‌రావు సతీమణులను నిలిపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి ఆత్మ కమిటీ డివిజన్ చైర్మన్ మల్లారెడ్డి, యేర్ల రాజశేఖర్‌రెడ్డి వారి సతీమణులు, బీజేపీ నుంచి మల్లం సుమతి, ఎల్కంటి సురేశ్, పంజాల అశోక్‌గౌడ్, బీనమైన ప్రభాకర్, మన్నె శేఖర్ వారి సతీమణులను నిలిపే అవకాశం ఉంది. కొండపాక బీఆర్ఎస్ నుంచి నర్రా జైపాల్‌రెడ్డి, ప్రశాంత్, నూనె కుమార్, మంచాల శ్రీనివాస్, రాధాకిషన్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి వాసరి లింగారావు, వెలికట్ట సురేందర్, అంకిరెడ్డిపల్లి సుదర్శన్, బీజేపీ నుంచి నలగామ శ్రీనివాస్, నందాల శ్రీనివాస్, రామస్వామి, మర్కుక్ బీఆర్ఎస్ నుంచి కరుణాకర్‌రెడ్డి, తాండ పాండుగౌడ్, రాంచంద్రం, మేకల కనకయ్య, బీజేపీ నుంచి రాంరెడ్డి, సింగం సత్తయ్య, కాంగ్రెస్ పార్టీ నుంచి తిరుమల్‌రెడ్డి, కనకయ్యగౌడ్‌లు ప్రయత్నాలు చేస్తున్నారు. ములుగు మండలం బీఆర్ఎస్ నుంచి భట్టు అంజిరెడ్డి, మహ్మద్ జుబేర్, బీజేపీ నుంచి చెట్టి సురేశ్‌గౌడ్, వంటిమామిడి లక్ష్మణ్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ ఎంపీపీ వెంకట్రాంరెడ్డి, క్షీరసాగర్ బాల్‌రెడ్డి, మాజీ ఫాక్స్ చైర్మన్ పోచిరెడ్డి, శంకర్‌రెడ్డి, వర్గల్ బీఆర్ఎస్ నుంచి వేలూరు వెంకట్‌రెడ్డి, తునికి మక్తా వెంకటేశ్, మహిపాల్‌రెడ్డి, బాలుయాదవ్‌లు, కాంగ్రెస్ నుంచి తూంకుంట గోపాల్‌రెడ్డి, అట్ల సందీప్‌రెడ్డి, నీల శ్రీనివాస్ సతీమణులను బరిలో దింపనుండగా, తూంకుంట ఆంక్షారెడ్డిని బరిలో నిలిపేందుకు ప్రయత్నాలు సాగుతున్నట్లు తెలిసింది. ఇక బీజేపీ నుంచి పూదరి నందన్‌గౌడ్, తిరుపతిరెడ్డిలు తమ సతీమణులను బరిలో దింపనున్నట్లు తెలిసింది. జగదేవ్‌పూర్ బీఆర్ఎస్ నుంచి కామల్ల భూమయ్య, పనుగట్ల శ్రీనివాస్‌గౌడ్ సతీమణులు పోటీలో ఉండగా, కాంగ్రెస్ బత్తుల మల్లేశం, బీజేపీ నుంచి చాట్లపల్లికి చెందిన ఐలయ్య, పేర్ల శ్రీనివాస్‌లు తమ సతీమణులను బరిలో నిలిపేందుకు యత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. కుకునూరుపల్లి మండలం బీఆర్ఎస్ నుంచి కనకయ్య, దేవీ రవిందర్ వారి సతీమణులను బరిలో నిలపాలని యోచిస్తుండగా, కాంగ్రెస్ నుంచి అండాలమ్మ పోటీ పడుతున్నట్లు తెలిసింది.

డ్రంకెన్ డ్రైవ్‌లో 22 మందికి జరిమానా

● ఒకరికి జరిమానాతో పాటు జైలు

సిద్దిపేట క్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 22 మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి. తరణి ఎదుట కోర్టులో హాజరుపరచగా విచారణ అనంతరం నిందితులకు రూ.18,400 జరిమానా విధించారు. వారిలో ఒక వ్యక్తికి ఒక రోజు జైలు శిక్ష విధించారు.

బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలి



అల్వాల గురుకుల పాఠశాలలో నిరసన వ్యక్తం చేస్తున్న పార్ట్‌టైం టీచర్లు

మిరుదొడ్డి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం టీచర్లకు ఉద్యోగభద్రతను కల్పించడంతోపాటు పెండింగ్ వేతనాలను చెల్లించాలని పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పొన్నం రాజు డిమాండ్ చేశారు. సోమవారం మిరుదొడ్డి మండలం అల్వాల గురుకుల పాఠశాలలో మధ్యాహ్న విరామసమయంలో పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్‌చేస్తూ నల్లబాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత 3 నెలలుగా పార్ట్‌టైం టీచర్లను వేతనాలను చెల్లించడం లేదన్నారు. దీంతో దసరా పండుగరోజున పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పార్ట్‌టైం టీచర్లకు రావాల్సిన పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పార్ట్‌టైం టీచర్లు శ్రీనివాస్, కనకరాజు, శ్రీధర్, అశోక్, సత్యం, ప్రశాంత్, బీరప్ప, చారి తదితరులున్నారు.

సామలపల్లి వాసుల ముందస్తు అరెస్ట్



బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో సామలపల్లి వాసులు

గజ్వేల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ట్రిబుల్ ఆర్ భూనిర్వాసితులు హెచ్ఎండీఏ కార్యాలయ ముట్టడికి వెళ్లనున్న నేపథ్యంలో వర్గల్ మండలం సామలపల్లి గ్రామస్థులను బేగంపేట పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. పలువురు బాధితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ చర్యలను తప్పుబట్టారు. సామలపల్లి వాసులను, ట్రిబుల్‌ఆర్ వాసులను ముందస్తుగా అరెస్ట్ చేయడం సరికాదని మండిపడ్డారు. ప్రభుత్వం అరెస్ట్‌లతో ట్రిబుల్‌ఆర్ నిర్మాణాన్ని చేపట్టాలని చూస్తుందా అని ప్రశ్నించారు. ట్రిబుల్ ఆర్ బాధితులకు భూమికి భూమి ఇవ్వాలని, లేదా మార్కెట్ ధరకు మూడు రేట్లు నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల అంగీకారం మేరకే భూసేకరణ చేపట్టాలన్నారు.

మహిళలు మౌనం వీడి ధైర్యంగా ఫిర్యాదు చేయాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మల్లారెడ్డి

గజ్వేల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మహిళలు మౌనం వీడి ధైర్యంగా ఫిర్యాదు చేయాలని గజ్వేల్ ఎస్ఐ మల్లారెడ్డి సూచించారు. గజ్వేల్ పట్టణంలోని విశ్వతేజ జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు ఆయా చట్టాలపై షీటీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అవసరం ఉంటే తప్ప సోషల్ మీడియాను ఉపయోగించవద్దన్నారు. ఏదైనా అన్యాయం జరిగితే మహిళలు మౌనం వీడి ధైర్యంగా ఫిర్యాదు చేయాలని, మహిళల భద్రతకు కట్టుబడి పనిచేస్తున్నామన్నారు. ఆయనవెంట కళాశాల ప్రిన్సిపాల్ రాజు, ఉపాధ్యాయులు, గజ్వేల్ షీటీం బృందం సభ్యులు శ్రీరాములు, మహేందర్‌రెడ్డి, సిబ్బంది తదితరులున్నారు.

మాజీ ఎంపీటీసీ మృతిపై సంతాపం



నివాళులర్పిస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి తదితరులు

చేర్యాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం వీరన్నపేట గ్రామ మాజీ ఎంపీటీసీ పోకల వెంకటేశ్వర్లు(50) సోమవారం హఠాన్మరణం చెందాడు. ఈ మేరకు టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి, మాజీఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొమ్ము రవి తదితర నాయకులు సంతాపం వ్యక్తంచేశారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కుటుంబానికి మొగుళ్ల రాజిరెడ్డి రూ.30వేలు ఆర్థికసహాయం అదజేశారు.

స.హ.చట్టాన్ని పరిరక్షించుకుందాం: డీబీఎఫ్



ప్రచార యాత్రను ప్రారంభిస్తున్న డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ

గజ్వేల్ రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కుచట్టాన్ని పరిరక్షించుకొని వారోత్సవాలను జయప్రదం చేద్దామని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి అన్నారు. ఈ నెల 5నుంచి 12వ తేదీ వరకు జరుగుతున్న వారోత్సవాల్లో భాగంగా డీబీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఏటిగడ్డ కిష్టాపూర్‌లో ప్రచారయాత్రను ప్రారంభించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స.హ.చట్టం ప్రభుత్వ కార్యకలాపాలలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని ప్రోత్సహిస్తూ అవినీతిని అరికట్టడానికి సహాయపడుతుందన్నారు. ఈ చట్టం వినియోగదారులకు సాధికారతను కల్పించి, ప్రజాస్వామ్య పాలనను సహాయపడుతుందన్నారు.